క్లుప్తంగా

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

పొదలకూరు : మండలంలోని ఉలవరపల్లిలో ఈనెల 16వ తేదీన విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందగా, దీనిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు.. గ్రామానికి చెందిన పులిపాటి రమణయ్య(47) పొలాల వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందారు. కుటుంబసభ్యులు రమణయ్య కోసం గాలించి మృతదేహాన్ని గుర్తించి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే మృతదేహం పడి ఉన్న స్థితి తదితర కారణాలను దృష్టిలో ఉంచుకుని తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని కల్పన రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో జీజీహెచ్ నుంచి హెచ్‌ఓడీ డాక్టర్ లక్ష్మీనారాయణను మృతదేహాన్ని పూడ్చిన వద్దకు రప్పించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. గ్రామంలో ప్రాథమికంగా విచారణ కూడా నిర్వహించారు.

భూ మార్పిడిలో జాప్యం

- పెండింగ్‌లో భారీగా దరఖాస్తులు
- దరఖాస్తులు 4,860
- అనుమతి 1,872కు మాత్రమే


కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ భూమిలో వేసిన లేఅవుట్

కందుకూరు : జిల్లాలో ల్యాండ్ కన్వర్షన్ (వ్యవసాయ భూములు వ్యవసాయేతరానికి) దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉంటున్నాయి. మొత్తం నాలుగు రెవెన్యూ డివిజన్లలో ఈనెల 12 వరకు 4,860 మంది ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 1,872 దరఖాస్తులకు మాత్రమే అధికారులు ఆమోదం తెలిపారు. మిగిలినవన్నీ నెలల తరబడి అధికారుల వద్దే పెండింగ్‌లో ఉంటున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

వ్యవసాయ భూములను ఇతర ఉపయోగాలకు (కమర్షియల్ పర్పస్) వినియోగించాలంటే కచ్చితంగా ఆ భూమిని వ్యవసాయేతరగా మార్పిడి చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు డివిజన్లలో 4,860 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో అత్యధికంగా నెల్లూరు డివిజన్‌లో 2,836 ఉండగా, కావలి డివిజన్లో 1,162, కందుకూరు డివిజన్‌లో 517, ఆత్మకూరు డివిజన్‌లో అతితక్కువగా 345 వచ్చాయి. మొదటిగా ఆర్డీఓ స్థాయిలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను తహసీల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆ రిపోర్టును ఆర్డీఓకి సమర్పించాల్సి ఉంది. అయితే వీటిలో 2,231 వాటిపై మాత్రమే తహసీల్దార్‌లు రిపోర్టు తయారు చేసి పంపారు. వీటిలో 1,872 దరఖాస్తులను ఆర్డీఓలు ఆమోదం తెలపగా, 359 దరఖాస్తులను తిరస్కరించారు. ఆమోదించిన వాటిలో 1,785 దరఖాస్తులకు సంబంధించిన వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతరగా మార్చి రికార్డుల్లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ల వద్దే 54.09 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. వ్యవసాయభూమిని వ్యవసాయయేతరగా మార్చాలంటే సదరు భూమి రిజిస్ట్రేషన్ విలువలో 3 శాతం రెవెన్యూ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ కాలంలో ఇది దాదాపు 9 శాతం వరకు ఉంది. భూయజమానులకు ఇది భారంగా మారడంతో ప్రస్తుత ప్రభుత్వం 3 శాతానికి తగ్గించింది. దీంతో అన్నివర్గాల ప్రజలకు ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు అందుబాటులోకి వచ్చాయి. కానీ రెవెన్యూ అధికారులు దీన్ని సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇష్టారీతిన

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో వ్యవసాయ భూములకు ఎటువంటి అనుమతి లేకుండా కొందరు వ్యవసాయేతర భూములుగా మార్చేస్తున్నారు. వీరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందు వరుసలో ఉన్నారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. కందుకూరు పట్టణంలో ఇటీవల వెలిసిన లేఅవుట్ ఇందుకు నిదర్శనం. 60 అడుగుల రోడ్డు, పోతురాజుమిట్ట, మహదేవపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో పదుల ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేశారు. ఇందుకు కచ్చితంగా భూ స్వభావాన్ని మార్చడంతో పాటు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే ఏమీ లేకుండానే లేఅవుట్‌లు వేయడం వల్ల అటు రెవెన్యూకు, ఇటు మున్సిపాలిటీకి రావాల్సిన రాబడిని కోల్పోవాల్సి వస్తోంది. పైగా ఎలాంటి మౌలిక వసతులు లేకుండా వేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు తరువాత అనుమతుల పేరుతో పెద్ద ఎత్తున జరిమానాల రూపంలో పన్నులు కట్టాల్సి వస్తోంది.

సంక్షేమం, అభివృద్ధి పక్కాగా అమలు


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నెల్లూరు (అర్బన్) : సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పక్కాగా, పారదర్శకంగా అమలు జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. వెలగపూడి సచివాలయం నుంచి అభివృద్ధి, సంక్షేమం, ఇతర ప్రాధాన్యత కార్యక్రమాల అమలు పురోగతిపై గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మట్, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి తదితరులు కన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించిన దానికి సమాధానంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. మొదటిదశ కింద చేపట్టిన రీసర్వే ప్రక్రియలో రాళ్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. స్పందన అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆర్బీకేలు, వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు అండగా ఉన్నామన్నారు. జిల్లాలో మల్టీ పర్పస్ ఫెసిలిటీ గోడౌన్‌ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. నవరత్నాలు, ఇళ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీ, హార్టికల్చర్, రహదారుల భూ సేకరణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, సీపీఓ రాజు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


రెస్క్యూ పరికరాల పనితీరుపై డెమో ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్) : అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రైల్వేఫీడర్స్‌రోడ్డులోని అగ్నిమాపక కేంద్ర ఆవరణలో లెండి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అగ్నిప్రమాద నివారణ చర్యలు, రెస్క్యూ ఎక్విప్‌మెంట్, ప్రమాద సమయంలో సిబ్బంది పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అగ్నిప్రమాదాలు ఎలా సంభవిస్తాయి? ప్రమాద నివారణ చర్యలు? తనను తాను రక్షించుకుంటూ ఇతరులను ఎలా రక్షించుకోవాలి? తదితరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా అన్ని అగ్నిమాపక కేంద్రాల పరిధిలో పరిశ్రమలు, అపార్ట్‌మెంట్‌లు, విద్యాసంస్థలు, షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్, సినిమా థియేటర్‌లు, పెట్రోల్ బంకులు, గోదాములు తదితరాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రధాన కూడళ్లు, రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌ల్లో కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో డెమో ద్వారా వివరించామన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు అగ్నిమాపక కేంద్ర అధికారి జాషువా, లెండీ కళాశాల ప్రతినిధి శశికాంత్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొరుగు జాలర్లతో తీవ్ర నష్టం

- మూడు జిల్లాల మత్స్యకారుల ఆవేదన


సమావేశంలో పాల్గొన్న మత్స్యకార కాపులు, నేతలు

అల్లూరు : పొరుగు రాష్ట్ర జాలర్లు ఇక్కడ చేపల వేట సాగిస్తుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని మూడు జిల్లాలకు చెందిన మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని 120 గ్రామాల నుంచి దాదాపు వెయ్యి మంది మత్స్యకారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన కడలూరు, కారైకల్ బోట్లు నిత్యం తమ తీరాల వెంబడి వేట సాగించడంతో నష్టపోతున్నామని, దీనిపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారన్నారు. వారి హైస్పీడ్ బోట్లను అడ్డుకోవాలంటే ఒకటి లేదా రెండు పెద్ద బోట్లను కొనుగోలు చేయాలని, వాటి ఖరీదు దాదాపు రూ.కోటి వరకు ఉంటుందన్నారు. దీనికి మత్స్యకారులందరూ తమ సహాయ సహకారలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కపల్లి పెదకాపు తోటయ్య, చినకాపు చిన పార్వతయ్య, గ్రామ కాపు శీనయ్య పాల్గొన్నారు.

యజమానికి తెలియకుండానే రిజిస్ట్రేషన్

కావలి : కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీవినీ ఎరుగని రీతిలో హైటెక్ మోసం వెలుగుచూసింది. పొలం యజమానికి తెలియకుండానే అతని భూమిని లేఅవుట్‌లు చేసి ఇతరులకు విక్రయించిన ఘటన అధికార వర్గాల్లో కలకలం రేపింది. రిజిస్ట్రేషన్ కోసం బాధితుడి ఫొటోలు, వేలిముద్రలు, ఐరిష్ వినియోగించడం ఇక్కడ అంతు చిక్కని విషయంగా మారింది. బాధితుడు కాసుల బాదుల్లా పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు.. కొండాపురం మండలం కొమ్మికి చెందిన కాసుల బాదుల్లాకు మద్దూరుపాడులోని సర్వే నంబర్ 214లో 3.96 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని 2010లో కొనుగోలు చేశాడు. ఇటీవల కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తన భూమి ఫొటోలు, సర్వే నంబర్లతో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తెలుసుకుని ఖంగుతిన్నాడు. ఈ విషయంపై గురువారం కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఆరా తీయగా కళ్లు చెదిరే వాస్తవాలు వెలుగు చూశాయి. గత ఫిబ్రవరి 15వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి పొలం యజమాని ఆధార్‌కార్డు, ఇంటి అడ్రస్‌లు ఇచ్చి ఫొటో, ఐరిష్, వేలిముద్రలతో 100 అంకణాల భూమిని 30, 35, 35 అంకణాలతో మూడు ప్లాట్లుగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించాడు. గుడ్లూరు మండలానికి చెందిన ఇద్దరికి, అల్లూరు మండలం ఇస్కపల్లికి చెందిన ఒకరికి ప్లాట్లు అమ్మినట్లుగా గుర్తించాడు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు కుమ్మక్కై అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లుగా ఆరోపిస్తూ కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.75
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	125
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	218
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	242
లేయర్ చికెన్ :	128

బారాషహీద్ దర్గాలో విస్తృత ఏర్పాట్లు




ఈద్ – ఉల్ – ఫిత్రను పురస్కరించుకొని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. దీని కోసం నగరపాలక సంస్థ రూ.10 లక్షలను కేటాయించింది. దాదాపు 20 వేల నుంచి 25 వేల మంది ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేపట్టారు. రేకులతో పందిళ్లు, ఏసీ కూలర్లు, గ్రీన్ పరదాలను ఏర్పాటు చేస్తున్నారు. నజీర్‌తోట, పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఈద్గా, బర్మాషెల్‌గుంట, బుజబుజనెల్లూరు సమీపంలోని ఈద్గాల్లో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నారు.

– నెల్లూరు(బారకాసు)

రెమ్యూనరేషన్ పెంపుపై ధన్యవాదాలు

నెల్లూరు (టౌన్) : పదో తరగతి మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను పేపర్‌కు రూ.10కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల తాడేపల్లిలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు చంద్రశేఖరరెడ్డి, కల్పలతారెడ్డి కలిసి పది మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత మూల్యాంకనం రెమ్యూనరేషన్ పేపర్‌కు రూ.6.60 ఉండగా, పెంచిన దాని ప్రకారం రూ.10 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన ఎంపీ



నెల్లూరు(క్రైమ్): నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు విజయ్‌భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసయాదవ్, నేతలు మల్లికార్జున యాదవ్, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నిరాదరణకు గురైన వారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నిరాదరణకు గురైన పది మంది మహిళలకు కుట్టు మెషీన్లను కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ చర్చిలో నిర్వాహకుడు నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, శ్రీనివాసరావు, హనోక్, భూషణం, ధర్మారావు, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, సరుకుల అందజేత



నెల్లూరు (వేదాయపాళెం): నాలుగో మైలు సమీపంలోని బృందావనం కాలనీలో మూడు పూరిళ్లు కాలిపోయి నిరుపేదలు తీవ్ర ఇబ్బంది పడుతుండటంతో వారికి ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చేయూతనందించారు. మంచం, బియ్యం బస్తా, నెలకు సరిపడా సరుకులు, దుస్తులను అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, సభ్యులు నళిని, లలిత, స్వర్ణ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముంగమూరులోని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రానికి డ్రై ఫ్రూట్స్, పౌష్టికాహారం, నిత్యావసర సామగ్రిని ముస్లిం సేవా కమిటీ జిల్లా అధ్యక్షుడు ఖాలిద్ ఆధ్వర్యంలో అందజేశారు. తన తండ్రి గయాజ్‌బాషా, తాత హుస్సేన్ సాహెబ్ ఆత్మశాంతి కోసం కార్యక్రమాన్ని అహ్మద్ గౌస్ చేపట్టారని చెప్పారు. మైనుద్దీన్, ఆదరణ కేంద్ర డైరెక్టర్ సింహాద్రిరావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవించినా నేరమే



నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయిస్తేనే కాదు..సేవించినా జైలు ఊచలు లెక్కించాల్సిందేనని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల తో గురువారం ఆయన మాట్లాడారు. మాదకద్రవ్య రహిత జిల్లాగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి దా డులు చేస్తున్నామని పేర్కొన్నారు. గంజాయికి బానిసై నిరంతరం సేవిస్తున్న వారిపై సైతం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వారం వ్యవధిలో ఆరుగురిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపామని వివరించారు. గంజాయి విక్రయాలు, రవాణాపై 14500, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

సిబ్బందికి అభినందన

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా, వినియోగదారులను అరెస్ట్ చేసి రూ 15.83 లక్షల విలువజేసే గంజాయి, కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఈబీ టీమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, నెల్లూరు – 1, కావలి ఇన్‌స్పెక్టర్లు కిశోర్, శ్రీనివాసరావు, పోలీస్ టీమ్ ఎస్సై బాలకృష్ణ, ఆర్‌ఎస్సై గోపీనాథ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. త్వరలోనే వీరికి రివార్డులను అందజేయనున్నామని వెల్లడించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' ప్రభంజనం



లోహిత్ ఆదిత్య

నెల్లూరు (టౌన్): ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వివరాలను ఆయన వెల్లడించారు. ఎన్టీఏ విడుదల చేసిన ప్రొవిజనల్ కీ మేరకు జాతీయ స్థాయిలో నెల్లూరు బ్రాంచ్‌కు చెందిన లోహిత్ ఆదిత్యసాయి 300కు 300 మార్కులను సాధించారని చెప్పారు. ప్రణీత్‌సాయి, మేఘనారెడ్డి 280 మార్కులను సాధించారని తెలిపారు.

ప్రజలను మోసం చేయడం మానుకోండి



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

- అచ్చెన్నాయుడికి ఎమ్మెల్యే అనిల్ హితవు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రజలను మోసం చేయడాన్ని ఇప్పటికైనా మానుకోవాలని టీడీపీ నేత అచ్చెన్నాయుడికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ హితవు పలికారు. నగరంలోని 8వ డివిజన్లో గల గాండ్లవీధి, తానావీధి, మసీదు వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరును ప్రతి ఇంటికీ వెళ్లి ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరులో బీసీ సదస్సును ఏర్పాటు చేసిన టీడీపీ.. తమ పార్టీలోనే వారికి గౌరవం ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జిల్లా చరిత్రలో మొదటిసారి బీసీకి మంత్రి పదవిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని చెప్పారు. జిల్లా నుంచి మొదటిసారి బీసీని రాజ్యసభకు పంపారని గుర్తుచేశారు. రాష్ట్రంలో రాజ్యసభ స్థానాలు ఎనిమిదికి గానూ నాలుగింటిలో బీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయాన్ని మరిచి అచ్చెన్నాయుడు, మరొకరు ఏదేదో మాట్లాడటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. నగర నియోజకవర్గంలో బీసీ అభ్యర్థిని ఓడించేందుకు గానూ రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లను టీడీపీ ఖర్చు చేసిందని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వివిధ పదవులను ఇచ్చిన ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి టీడీపీని స్వాధీనం చేసుకున్న చంద్రబాబు.. ఎన్టీఆర్ బొమ్మను చూపిస్తూ ప్రజలను ఇంకా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేటర్ కామాక్షిదేవి, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ టాయ్‌లెట్ల ప్రారంభం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 8వ డివిజన్లో గల అరుంధతీయపాళెంలో రూ.43 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ టాయ్‌లెట్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రారంభించారు. అరుంధతీయపాళెంలో స్థానికులకు ఉపయోగపడేలా వీటిని నిర్మించామని వివరించారు. కార్పొరేటర్ కామాక్షిదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు రఘు, సాయి, తదితరులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీల్లో పనులు వేగవంతం

- కమిషనర్ వికాస్ మర్మత్



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసి, పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. వెంకటేశ్వరపురం సమీపంలోని జగనన్న కాలనీలో నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గృహాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని కోరారు. లే అవుట్ల నిర్మాణ.. అభివృద్ధి పనులను సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. విద్యుద్దీపాలు, మంచినీరు, డ్రెయిన్లు, రోడ్లు, పచ్చదనం, తదితర పనులను నెల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీఈఈ చంద్రయ్య, హౌసింగ్ కార్పొరేషన్ డీఈఈ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి చేయండి

నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని 42, 48వ డివిజన్లలో గురువారం తెల్లవారుజామున ఆయన పర్యటించారు. ఆయా డివిజన్లలోని సచివాలయాల్లో పారిశుధ్య సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సెలవుల్లో ఉన్న సిబ్బంది నుంచి కారణాలను ఆరాతీసి వారి నుంచి వివరణ తీసుకోవాలని సూచించారు. అనంతరం బోడిగాడితోట డంపింగ్ యార్డులో చెత్త సేకరణ, తరలింపు వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. స్థానికంగా ఉన్న వీధుల్లో డ్రెయిన్లు, కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని, మురుగు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని వెహికల్స్ షెడ్‌ను సందర్శించారు.

విధుల్లో నిబద్ధత పాటించాలి

ప్రజలకు అందించే సేవల్లో వార్డు సచివాలయ కార్యదర్శులు నిబద్ధత పాటించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరంలోని 54 / 1 లంగర్‌తోట, 54 / 3 బర్మాషెల్‌గుంట వార్డు సచివాలయాలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన డ్రస్ కోడ్‌ను తప్పక పాటించాలని పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూడాలని సూచించారు.

ప్రతిష్టాత్మకంగా బ్రహ్మోత్సవాల నిర్వహణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మల్లోల, తదితరులు

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల పదో తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను వేడుకగా జరపాలని ఆర్డీఓ మలోల సూచించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణం ఎంతో గొప్పది

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్: సేవా గుణం ఎంతో గొప్ప విషయమని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఖుద్దూస్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫాను గురువారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకుడు మున్వర్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కమిషనర్ వికాస్ మర్మత్‌ను నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, ఏఈ లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు.

కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టరూ..



ఏఓకు వినతిపత్రమిస్తున్న ఏబీవీపీ నేతలు

నెల్లూరు (టౌన్): వేసవి సెలవుల్లో తరగతులను నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నగర కార్యదర్శి యశ్వంత్ కోరారు. స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఐఓ కార్యాలయంలో ఏఓ గోపాల్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నా పట్టించుకోకుండా ఐఐటీ అడ్వాన్స్‌డ్, ఎంసెట్, తదితర పేర్లతో తరగతులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నేతలు రాహుల్, సాయి, నరసింహ, సుమన్, వినోద్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు తలెత్తకూడదు



మాట్లాడుతున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశాన్ని మేయర్ స్రవంతి గురువారం నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తాగునీటి ఎద్దడి తలెత్తకూడదని, నగరంలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలని పేర్కొన్నారు. అవసరమైన డివిజన్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని నిరంతరం సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న అరుణమ్మ

నెల్లూరు రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. పొట్టేపాళెంలోని జెడ్పీ హైస్కూల్, సచివాలయాన్ని గురువారం తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. పాఠశాలలో నాడు – నేడు పనులను పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. సచివాలయంలో సిబ్బంది ద్వారా పథకాల అమలు తీరును ఆరాతీశారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నగరంలోని 53వ డివిజన్లో గల గాంధీ గిరిజన కాలనీలో గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను ఆరాతీసి.. సంక్షేమ పథకాలపై వివరించారు. సచివాలయ ఇన్‌చార్జి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటరవి, ఆదిశేషమ్మ, ప్రభాకర్, శ్రీనివాసులు, సురేష్, నాగరాజు, ప్రమీల, గోపాల్, రమణయ్య పాల్గొన్నారు.

పొదుపు యానిమేటర్‌పై ఫిర్యాదు



నెల్లూరు (అర్బన్): పొదుపు ద్వారా తాము తీసుకున్న రుణానికి సంబంధించి చెల్లించిన మొత్తాన్ని బ్యాంకులో జమ చేయకుండా గ్రామ యానిమేటర్ స్వాహా చేశారని కలువాయి మండలం రామన్నగారిపల్లికి చెందిన వెంగమాంబ పొదుపు సంఘ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు డీఆర్డీఏ కార్యాలయంలో పీడీ సాంబశివారెడ్డికి గురువారం ఫిర్యాదు చేసిన అనంతరం వారు మాట్లాడారు. రూ.70 వేల చొప్పున రూ.ఏడు లక్షల రుణాన్ని ఏపీజీబీ ద్వారా 2021 ఫిబ్రవరిలో తీసుకున్నామన్నారు. దీనికి సంబంధించిన నెల వాయిదాలను వీఓఏ లక్ష్మీదేవికి చెల్లిస్తున్నామని, అయితే బ్యాంకులో జమ చేయకుండా స్వాహా చేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

కేజీబీవీల్లో దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): రానున్న విద్యా సంవత్సరంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం.. 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించామని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అనాథ, బడి బయట పిల్లలు, బడి మానేసిన వారు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ విద్యార్థినులు అర్హులని చెప్పారు.

ఈఎంఐల చెల్లింపులో సడలింపులివ్వాలని వినతి

నెల్లూరు(అర్బన్): ఈఎంఐల చెల్లింపు విషయంలో ఉద్యోగులకు పెనాల్టీ లేకుండా సడలింపులివ్వాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్, బారకాసు, ఫతేఖాన్‌పేటలోని ఎస్‌బీఐ శాఖల మేనేజర్లకు వినతిపత్రాలను గురువారం అందజేశారు. సంఘ జనరల్ సెక్రటరీ ప్రసాద్, కో చైర్మన్ శరత్‌బాబు, కోశాధికారి బాబూరావు, ఇరిగేషన్ యూనియన్ నేత చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ




నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 12వ డివిజన్ మంగళదిబ్బలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో గిరిజనుల ఇళ్లు ఆహుతయ్యాయి. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నరేంద్రరెడ్డి ఆర్థిక సహకారంతో పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి వారి మిత్ర బృందం వీరికి చేయూతనందించారు. బియ్యం, నిత్యావసర సరుకులు, చీరలు, దుప్పట్లను అందజేశారు. అశోక్, హరిబాబుయాదవ్, ప్రసాద్, రవి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను వెంకటేశ్వరపురంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఇన్ యూత్ సంస్థ అధ్యక్షుడు ఇర్ఫాన్ మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను 11 ఏళ్లుగా అందిస్తున్నామని వివరించారు. అనంతరం 100 మందికి గోధుమ పిండి, చక్కెర, సేమియా, నెయ్యితో కూడిన రంజాన్ తోఫా ప్యాకెట్లను అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ప్రసాద్, శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ విజయ్, షాహినాబేగం, తేజ, హైదర్ అలీ, వహీద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాపర్టీ షో



మాట్లాడుతున్న రామకృష్ణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ ప్రాపర్టీ ఎక్స్‌పోను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నామని నెల్లూరు బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ పేర్కొన్నారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ హోటల్లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ హౌస్‌లు, ఇళ్ల స్థలాలు, గృహోపకరణాలకు తక్షణమే రుణాలను వివిధ బ్యాంకుల ద్వారా ఒకే చోట ఎంపిక చేసుకునే అవకాశాన్ని కల్పించామని చెప్పారు. ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఎక్స్‌పో ఉంటుందని, దీనికి ప్రవేశం ఉచితమన్నారు. సందర్శకులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులను అందజేయనున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రాపర్టీ షోను ప్రారంభించనున్నారని తెలిపారు. క్రెడాయ్ నెల్లూరు చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ రామ్మూర్తిరెడ్డి, సెక్రటరీ మధుసూదన్, గ్రీవెన్స్ సెల్ చైర్మన్ రాజశేఖరం, జాయింట్ సెక్రటరీ గిరిప్రసాద్, ఈసీ మెంబర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలు

నెల్లూరు (టౌన్): టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, విజయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మ్యారేజ్ మీడియేటర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): వివాహ వ్యవస్థలో మ్యారేజ్ మీడియేటర్ల పాత్ర కీలకమని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని పురమందిరంలో గురువారం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోటిరెడ్డి, బాబు, సత్యంజీ, శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మహిళా విభాగ అధ్యక్షురాలు మమతారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరమణయ్య, పద్మావతమ్మ, జిల్లా కార్యదర్శి మస్తాన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు వెంకటాద్రి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

23న పద్మశాలి వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(వేదాయపాళెం): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని జాషువా గ్రంథాలయంలో పద్మశాలి వివాహ పరిచయ వేదికను ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నామని చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ కోటేశ్వరరావు తెలిపారు. వివరాలకు 80192 52072, 77021 13558 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఒడిశాకు చెందిన ఓ కుటుంబం ఉపాధి నిమిత్తం నెల్లూరుకు రెండేళ్ల క్రితం వచ్చింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలకు కుమార్తె హాజరయ్యారు. ప్రస్తుతం సెలవులు కావడంతో ఇంట్లోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పక్క వీధిలోని బంధువుల ఇంటికెళ్తానని చెప్పి బుధవారం ఆమె వెళ్లారు. అనంతరం రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. కాగా తమ కుమార్తె మూడు నెలలుగా అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో ఫోన్లో మాట్లాడుతుండగా మందలించామని, అదృశ్యం వెనుక అతని ప్రమేయం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఇఫ్తార్ విందు

నెల్లూరు(బృందావనం): నగరంలోని 47వ డివిజన్ అగ్నిపేట అబ్దుసమద్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గురువారం నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు రామకృష్ణ ఆచారి, కరిముల్లా, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన ... డోరు నెం.24/88 ..., మూలపేట, నెల్లూరు సిటీ ... [illegible] ... తేది 25.04.2023వ లోపల ఈ క్రింది ... [illegible]

జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన ... నెల్లూరు సిటీ ... [illegible]

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు ... [illegible]